# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

గురువారం। ఏప్రిల్ 3। 2025 | ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం | పేజీలు : 4


## సర్వాయి పాపన్నకు సీఎం రేవంత్ నివాళి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (భద్రాద్రి న్యూస్):** నిరంకుశ రాచరికాన్ని వ్యతిరేకించిన బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. బుధవారం సర్వాయి పాపన్న వర్ధంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని సీఎం నివాసంలో పాపన్న చిత్రపటానికి రేవంత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వందల ఏళ్ల క్రితమే రాజకీయ, సామాజిక సమానత్వానికి సబ్బండ వర్గాలను ఏకం చేసి పోరాడిన యోధుడు పాపన్న అని తెలిపారు. ఎంపీలు మల్లు రవి, కిరణ్‌కుమార్ రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్, రఘురాం రెడ్డి, వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్ కూడా సర్వాయి పాపన్నకు నివాళులర్పించారు.




**భద్రాద్రి కొత్తగూడెం (భద్రాద్రి న్యూస్):** ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం రాముల వారి ఆలయం లో వసంత పక్ష ప్రయుక్త శ్రీ రామ నవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం గరుడ ధ్వజ పట లేఖనం కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గరుడ ధ్వజ పటావిష్కరణ చేస్తారు. అనంతరం గరుడ ధ్వజాధివాసం కార్యక్రమాలు నిర్వహిస్తారు. అత్యంత పవిత్రమైన వస్త్రంపై ధ్వజపటాన్ని లిఖిస్తారు. దానికి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీతాయారు అమ్మ కోవెలలో పూజలు చేస్తారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి ఆటంకాలు కలగకుండా రక్షగా ఉండాలని కోరుతూ గరుత్మంతుని పటాన్ని ధ్వజస్తంభంపై ఎగరేస్తారు. కాగా 4న (శుక్రవారం) అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, 5న ఎదుర్కోలు, 6న నవమి రోజున తిరుకల్యాణం, పునర్వసు దీక్ష ప్రారంభం తదితర కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే ఏప్రిల్ 7న మహాపట్టాభిషేకం, 12న చక్రతీర్థం, శ్రీపుష్పయాగంతో ఉత్సవ సమాప్తి కానుంది. శ్రీరామనవమి, మహాపట్టాభిషేక మహోత్సవాలకు గవర్నర్, సీఎంలను ఆహ్వానిస్తూ అధికారులు రాజ పత్రాలను అందించారు. కాగా శ్రీ రామ నవమి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భద్రాచలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

## రైతులకు మేలు చేస్తే ఓర్వలేకున్నారు

- కల్వకుంట్ల కుటుంబంపై మంత్రి తుమ్మల ధ్వజం
- రాష్ట్రంలో సాగు విస్తీర్ణం, దిగుబడి పెరిగింది
- పంట ఉత్పత్తులను మద్దతుధరతో కొంటున్నాం
- పామాయిల్‌కు ఏడాదిలో 8500 పెరిగిన ధర
- సన్నాలకు బోనసతో రైతులకు మేలని వ్యాఖ్య



**హైదరాబాద్, ఏప్రిల్ 2 (భద్రాద్రి న్యూస్):** రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి పెరిగిందని, కనీస మద్దతు ధరకు పంట ఉత్పత్తుల కొనుగోలు చేస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సన్నాల సాగు వద్దని, వరి వేస్తే ఉరి వేసుకున్నట్లని ప్రకటించిన రోజులు పోయి.. సన్నాలకు బోనస్ ఇచ్చి, పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసే రోజులు వచ్చాయని పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బోనస్ అమలుతో రాష్ట్రంలో సన్నాల సాగు 60శాతానికి పెరిగిందని, రైతులకు మేలు జరిగిందని తెలిపారు. పీడీఎసలో సన్నాలు పంపిణీ చేసి దేశానికే తలమానికంగా రాష్ట్రాన్ని నిలబెట్టినట్లు తెలిపారు. రైతులకు ఏడాదిలో తమ ప్రభుత్వం రూ.34,667కోట్లు చెల్లిచండం చూసి.. కల్వకుంట్ల కుటుంబం ఓర్వలేకపోతున్నదని ధ్వజమెత్తారు. గతంలో రూ.లక్ష రుణమాఫీ చేయలేని వారు.. ఇప్పుడు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన తమను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుబంధు పేరుతో రూ.5వేలు ఇచ్చి, వివిధ సబ్సిడీ పథకాల కింద రైతులకు దక్కాల్సిన రూ.15 వేలకు ఎగనామం పెట్టారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఆ పథకాలను పునరుద్ధరించామని తెలిపారు. రైతుభరోసాను రూ.12 వేలకు పెంచి... రెండు నెలల్లోనే రూ. 5057.77 కోట్లు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని కూడా త్వరలోనే విడుదల చేస్తామని పేర్కొన్నారు. గతంలో పామాయిల్ సాగును పట్టించుకోలేదని, ఇష్టారీతిన కంపెనీలకు అనుమతులిచ్చి సాగును తగ్గించేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏడాదిలో గెలల ధర రూ.8,500పైగా పెరిగిందని తెలిపారు. రైతుబీమా పథకంలో చేరిన రైతులకు ప్రీమియం కూడా ప్రభుత్వమే భరిస్తున్నదని వివరించారు. బీఆర్ఎస్ నేతలు విమర్శించినంత మాత్రాన రైతులు నిజాలు తెలుసుకోకుండా ఉండరన్నారు. ఇప్పటికైనా కల్లబొల్లి కబుర్లు చెప్పడం మానేయాలని హితవు పలికారు.

## రాజీవ్ యువ వికాసం పథకాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం సరఫరాపై మీడియా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2( భద్రాద్రి న్యూస్):** రాజీవ్ యువ వికాసం పథకాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం సరఫరాపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఏప్రిల్ 14 వరకు రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్ లైన్ లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని లేదా ఎంపీడీవో కార్యాలయం, మున్సిపల్ కార్యాలయ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 50 వేల నుంచి 4 లక్షల రూపాయల వరకు సబ్సిడీ యూనిట్లు లభిస్తాయని అన్నారు. అభ్యర్థులకు వ్యవసాయేతర యూనిట్లకు 21 నుంచి 55 ఏళ్ళ వయస్సు ఉండాలని, వ్యవసాయ యూనిట్లకు 60 సంవత్సరాల వరకు సడలింపు ఉందని కలెక్టర్ తెలిపారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ లేదా ఆధాయ ధృవీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రంతో కలిపి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులకు అవసరమైన సర్టిఫికెట్లు వెంటనే 3 రోజులలో జారీ చేసేలా తహసీల్దార్ లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మండల జనాభా, గ్రామ జనాభా అనుగుణంగా కేటాయించిన లక్ష్యాల ప్రకారం యూనిట్లను మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. స్క్రూటినీ యూనిట్ లో స్పెషలిస్ట్ అధికారులను సైతం ఉంచుతామని అన్నారు. సెక్టార్ వారీగా అభ్యర్థులకు అవసరమైన శిక్షణ కూడా అందించడం జరుగుతుందని అన్నారు. డాక్యుమెంట్ కారణంగా ఎవరికి యూనిట్ ఆపడం జరగదని కలెక్టర్ తెలిపారు. బ్యాంక్ లింకేజీ రుణాలు కూడా తప్పనిసరిగా మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు అనవసరంగా తిరస్కరించడానికి వీలు లేదని అన్నారు. అభ్యర్థులకు అవసరమైన శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు.

మిగతా.. 2



# గురుకులాల్లో కొత్తగా ఫౌండేషన్ కోర్సులు

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (భద్రాద్రి న్యూస్):** సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఫౌండేషన్ కోర్సుల ప్రారంభానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడానికి ఈ కోర్సులు దోహదపడతాయన్న నిపుణులు, అధ్యాపకుల సూచనల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా పలు దఫాల చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీజీఎసడబ్ల్యూఆర్ఈఐఎస(తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్) కార్యదర్శి వి.ఎస.అలగు వర్షిణి తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో 8వ తరగతి నుంచి కోర్సులను ప్రారంభించేలా చర్యలు చేపట్టామని, అందుకు సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేశామని ఆమె తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి అర్హత సాధించిన వారికి ఫౌండేషన్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం కల్పిస్తారు. నైపుణ్యం, అనుభవం ఉన్న అధ్యాపకుల ద్వారా శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు.

# రాతి గుండె తల్లి

- అమీన్‌పూర్ ఘటనలో దుర్మార్గానికి ఒడిగట్టింది కన్నతల్లే
- చిన్ననాటి స్నేహితుడితో కొన్నాళ్లుగా వివాహేతర సంబంధం
- భర్తను వదిలేసి ప్రియుడిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయం
- పిల్లలను అడ్డుతొలగించుకుంటేనే పెళ్లి అని ప్రియుడి షరతు
- ముక్కు, నోరు అదిమి ముగ్గురు పిల్లల్ని హత్యచేసిన రజిత
- ఆమెతో పాటు ప్రియుడు శివకుమార్ అరెస్టు.. రిమాండ్



**సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 2 (భద్రాద్రి న్యూస్):** అభంశుభం తెలియని ముగ్గురు పిల్లలు రాత్రి నిద్రపోయినవారు నిద్రపోయినట్లుగా ప్రాణాలొదలడం.. పక్కనే నిద్రించిన తల్లి అర్ధరాత్రి తర్వాత కడుపునొప్పితో తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలైన ఘటన గుర్తుందా? వారం క్రితం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో జరిగిన ఈ ఘటనలో వేళ్లన్నీ భర్తవైపే చూపాయి. భార్య ప్రవర్తనను అనుమానించే ఆ భర్త తరచూ ఆమెతో గొడవపడటం. ఆ వేధింపులను తాళలేక ఒకానొక దశలో ఆమె పుట్టింటికి వెళ్లిపోవడం.. మళ్లీ గొడవపడితే పిల్లలను చంపేసి తాను చస్తాననే షరతుతో తిరిగి కట్టుకున్నవాడి చెంతకు రావడంతో భర్త తీరు కారణంగానే పిల్లలతో కలిసి విషాహారం తిని ఆత్మహత్యాయత్నం చేసిందా? లేదంటే ఆ భర్తే.. పిల్లలను, భార్యను వదిలించుకు నేందుకు ఘోరానికి ఒడిగట్టి ఉంటాడా? అనే అనుమానాలు తలెత్తాయి. అయితే ఎవ్వరూ ఊహించని విధంగా దిగ్భ్రాంతి కరమైన వాస్తవం విచారణలో వెలుగుచూసింది! ఆ భార్యే ఘోరానికి ఒడిగట్టింది. పేగు తెంచుకొని పుట్టారన్న మమకారాన్ని మరిచిపోయి.. ప్రియుడి మోజులో కళ్లు మూసుకుపోయి.. అతడితో తన పెళ్లికి బిడ్డలే అడ్డుగా ఉన్నారని వారిని నిర్దాక్షిణ్యంగా చంపుకొంది ఆ తల్లేనని పోలీసులు తేల్చారు. కేసు వివరాలను సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మెదక్‌పల్లికి చెందిన అవురిచింతల చెన్నయ్య (50) మొదటి భార్య చనిపోయింది. కొన్నాళ్లకు తనకన్నా వయసులో 20 ఏళ్ల చిన్నదైన రజిత (30) అలియాస్ లావణ్యను చెన్నయ్య రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు సాయికృష్ణ(12), మధుప్రియ(10) గౌతమ్(8) పిల్లలు. అమీన్‌పూర్ మండలం బీరంగూడలోని రాఘవేంద్ర కాలనీలోని ఓ అద్దె ఇంట్లో ఈ కుటుంబం ఉంటోంది. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా చేస్తున్నాడు. రజిత స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. రజిత ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న చెన్నయ్య తరచూ ఆమెతో గొడవ పడేవాడు. అతడి వేదింపులు భరించలేక ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దలు నచ్చజెప్పడంతో తిరిగి భర్త చెంతకు వచ్చింది. గత నెల 27వ తేదీ రాత్రి 8 గంటలకు పిల్లలతో కలిసి చెన్నయ్య, రజిత భోజనం చేశారు. రజిత, పిల్లలు పెరుగన్నం తినగా చెన్నయ్య పప్పన్నం తిని విధులకు వెళ్లిపోయి రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికొచ్చాడు. తెల్లవారుజామున మూడు గంటలకు రజిత తనకు కడుపునొప్పి అంటూ బిగ్గరగా రోదించడంతో స్థానికుల సాయంతో భర్త చెన్నయ్య ఆమెను ఆస్పత్రికి తరలించాడు. తర్వాతే ముగ్గురు పిల్లలు మృతిచెందినట్లుగా గుర్తించారు.

**చిన్ననాటి స్నేహితుడితో వివాహేతర సంబంధం** రజితకు పదో తరగతి చదివే రోజుల్లో నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం గోడుకొండ్లకు చెందిన నూరు శివకుమార్ (30) క్లాస్‌మేట్! ఆరు నెలల క్రితం పదో తరగతి విద్యార్థులంతా గెట్ టుగెదర్ పార్టీ చేసుకుంటే రజిత వెళ్లింది. అక్కడ శివకుమార్‌తో మాట్లాడిన రజిత.. అతడితో చనువు పెంచుకొని వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్త చెన్నయ్యను వదిలేసి వస్తానని, తనను పెళ్లి చేసుకోవాలని శివను కోరింది. నీకు ముగ్గురు పిల్లలు ఉన్నారు కదా.. కుదరదు అని అతడు చెబితే.. వారిని అడ్డుతొలగించుకొని వస్తానని రజిత అతడికి చెప్పింది. దీనికి అతడు సరేనన్నాడు. ఘటన రోజే శివకు ఫోన్ చేసిన రజిత తాను పిల్లలను చంపబోతున్నట్లు చెప్పింది. ఆ రోజు రాత్రి భర్త, పిల్లలతో కలిసి భోజనం చేశాక చిన్నారులను పడుకోబెట్టింది. భర్త విధులకు వెళ్లిపోయాక నిద్రలో ఉన్న పిల్లలు సాయికృష్ణ, మధుప్రియ, గౌతమ్‌ను ఒక్కొక్కరిగా టవల్‌తో ముక్కు, నోరు అదిమిపట్టి.. ఊపిరాడకుండా చేసి చంపేసింది. తర్వాత.. పెరుగన్నం తినడంతోనే ముగ్గురు పిల్లలు మృతి చెందారని నమ్మించేందుకు కడుపునొప్పి నాటకం ఆడి భర్తను, పోలీసులను నమ్మించేందుకు ప్రయత్నించింది. ఈ కేసులో నిందితులు రజిత, ఆమె ప్రియుడైన శివను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# రాజీవ్ యువ వికాసం పథకాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి

మొదటి పేజీ తరువాయి...

ప్రతిరేషన్ షాపులో తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా సన్న రకం బియ్యం సరఫరా చేయడానికి చర్యలు చేపట్టామని అన్నారు. రేషన్ డీలర్ల ఓనర్ షిప్ రీ–వెరిఫికేషన్ చేస్తామని, సరిగ్గా పని చేయని రేషన్ డీలర్లపై తప్పనిసరిగా చర్యలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టడానికి వీలు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. లబ్దిదారులకు ఎవరైనా సన్న బియ్యం కాకుండా నాణ్యత లేని బియ్యం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జ్ ఇడి నవీన్ బాబు, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎన్ విజయలక్ష్మీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డా. బి. పురంధర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, ప్రింట్, ఎలెక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల పట్ల కేంద్ర ప్రభుత్వ పక్షపాత వైఖరి



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2( భద్రాద్రి న్యూస్):–**
కేంద్ర ప్రభుత్వం జనవరి నెలలో ఇవ్వాల్సిన ఒక విడత కరువు భత్యం ఆలస్యంగానైనా ప్రకటించింది కదా అని సంతోషించాలా లేక ఇక మీకు నూతన వేతన సవరణ సంఘం సిఫారసులు వర్తించవని చావు కబురు చల్లగా చెప్పిన కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ వ్యతిరేక వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్త పరచాలో అర్థం కావటం లేదని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్, తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు ఏ. రాజేంద్ర బాబు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి. నర్సింగ్ రావు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలిశోజు రామమనోహర్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బి. నర్సయ్య నేడు జారీ చేసిన ఒక పత్రికాప్రకటనలో తీవ్రంగా విమర్శిచారు. 1-1-2026 కంటే ముందు పదవీవిరమణ పొందిన పెన్షనర్లు, ఆ తర్వాత రిటైర్ కాబోతున్న పింఛనుదారులు వేరు వేర ని కృత్రిమ వర్గీకరణ చెయ్యడం ఇదివరకే చాలా సందర్భాలలో భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పులకు విరుద్ధమని వారు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టారు. పి ఆర్ సి సూచించబోయే ప్రయోజనాలు ఎప్పటి నుండి అమలు చెయ్యాలో, ఎవరికి అమలు చెయ్యాలో నిర్ణయించే అధికారం పూర్తిగా ప్రభుత్వానిదే నని పేర్కొనడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని వారు ఆ ప్రకటనలో ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల ప్రయోజనాలకు హాని కలిగించే ఈ చట్టానికి తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం తన అసమ్మతిని తెలియజేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు విజ్ఞప్తి చేశారు.

# మహిళలు ఆర్థిక స్వావలంబన కలిగి ఉంటే వ్యాపారాభివృద్ధి సాధిస్తారు

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- వేసవి కాలానుగుణంగా పరిస్థితులను బట్టి వ్యాపారాలను విస్తరించుకోవాలి..
- అందించిన తోడ్పాటు అవకాశాలను ఉపయోగించుకొని పదిమందికి ఉపాధి ఇవ్వాలి
- అప్పటి నుండి ఇప్పటి వరకు నాణ్యత, టీ రుచిలో ఏలాంటి లోటు లేదు

**చెల్లెమ్మ అంటూ కితాబుచ్చిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్-02 (భద్రాద్రి న్యూస్):** ప్రజలలో నమ్మకం కలిగిస్తూ నాణ్యతను పెంచుతూ వ్యాపారాలను విస్తరించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకాంక్షించారు. ఖమ్మం జిల్లా సమీకృత కార్యాలయం బస్ స్టాప్ సెంటర్ లోని ఇందిరా మహిళా శక్తి స్త్రీ టీ స్టాల్ ను బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించారు. స్త్రీ టీ స్టాల్ నిర్వహకురాలని కలెక్టర్ పలకరించారు. రోజు కలెక్టరేట్ కు వస్తూ, పోతూ చూస్తున్నాను జనం ఉంటూన్నారు. వ్యాపారం మంచిగా నడుస్తుందా, వేసవి కాలం దృష్ట్యా వ్యాపార అభివృద్ధిలో భాగంగా బటర్ మిల్క్, లెమన్ వాటర్, మిల్క్ షేక్, ఫాలుదా, పండ్ల రసాలు వంటివి విక్రయించేందుకు గల అవకాశాలు పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. పాల ఉత్పత్తులతో నాణ్యమైన లస్సీ తయారు చేసి అమ్మితే అధిక లాభాలు వస్తాయని, ఆ దిశగా ఆలోచనలు చేయాలని కలెక్టర్ సలహా ఇచ్చారు. నూతనంగా వివిధ రకాల చల్లని ఐస్ క్రీమ్ లు, కూల్ డ్రింక్స్ ఏర్పాటు చేశారు సంతోషం అని, ప్రజలకు నాణ్యమైన పదార్థాలు విక్రయిస్తూ మంచి లాభాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్లాస్టిక్ వస్తువులను నిర్మూలిస్తూ ప్రస్తుత ఉన్న కాలాన్ని అనుగుణంగా ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని నాణ్యతను కొనసాగిస్తూ, నమ్మకాన్ని



పెంచుకోవాలని సూచించారు. ఉపాధి పొందడమే కాక ఆర్థిక బలంతో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. టీ స్టాల్ నిర్వహకురాలి కోరిక మేరకు కలెక్టర్ టీ సేవించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు చాయ్ ని ఆదే నాణ్యతను, రుచి కొనసాగిస్తున్నందుకు ప్రశంసితూ అద్భుతమైన రుచితో టీ బాగుంది చెల్లెమ్మ అంటూ కలెక్టర్ కితాబు ఇవ్వారు. మహిళలు ఆర్థికంగా బలపడాలనే సంకల్పంతో ఇందిరా మహిళా శక్తిలో భాగంగా స్త్రీ టీ స్టాల్స్ ను మరిన్ని ఖమ్మంలో నెలకొల్పి మహిళలను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి యూనిట్లను నిరంతరం పర్యవేక్షణ చేస్తూ స్త్రీ టీ క్యాంటీన్ మంజూరు చేసి నిర్వాకులకు వ్యాపారంలో తోడుగా అధికారులు ఉంటున్నారని అన్నారు. యూనిట్ కేటాయించాక ఏ మేరకు లాభాలు ఉంటాయనే అంశంతో పాటు వాటి నిర్వహణ, లాభాలను అంచనా వేస్తున్నామని అన్నారు. మహిళలు స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశ్యంతో స్త్రీ టీ క్యాంటీన్లు ఖమ్మం బ్యాండ్ ఉండే విధంగా ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం తరపున యూనిట్ గ్రౌండ్ చేసి, స్థల గుర్తింపు, ఏమేం అమ్మాలి, నాణ్యతపై క్షుణ్ణంగా చర్చించి , శిక్షణ ఇప్పించాకే వారికి అర్థిక సహాయం అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

# గొడవర్తి గౌరమ్మ భౌతిక కాయాన్ని నివాళులర్పించిన చాంబర్ ఆఫ్ కామర్స్





**ఖమ్మం ప్రతినిధి ,ఏప్రిల్ 2 (భద్రాద్రి న్యూస్):-** ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షులు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు ,అధ్యక్షులు చిన్ని కృష్ణారావు , ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం , ఉపాధ్యక్షులు సోమ నరసింహారావు ,సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణయ్య, సెంట్రల్ ఈసీ సభ్యులు కైలాసపు వేణుగోపాల్ రావు ,పాయల నాగేశ్వరరావు ,విడాల శ్రీనివాసరావు , మిర్చి శాఖ కార్యదర్శి యడ్లపల్లి సతీష్ , జనరల్ కార్యవర్గ సభ్యులు బండి సతీష్ , ఛాంబర్ మాజీ ఉపాధ్యక్షులు పత్తిపాక రమేష్ గారు,మాజీ కోశాధ్యక్షులు తూములూరి లక్ష్మీ నరసింహ రావు , సభ్యులు మోత్కూరి భద్రయ్య తదితరులు పాల్గొని వారి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు సంతాప సానుభూతి తెలియజేసినారు.

# లక్ష్మీ సాహితిని సన్మానించిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**వైరా, ఏప్రిల్ 2, (భద్రాద్రి న్యూస్,)**



గ్రూప్ వన్ ఫలితాల్లో 129 వ ర్యాంకు సాధించిన వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన సంఘపు వెంకటేశ్వర్లు, కవిత దంపతుల కుమార్తె లక్ష్మిసాహితీని వైరా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాల దుర్గాప్రసాద్, మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బుర్ర రాజశేఖర్, పీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదునూరి సీతారాములు, దొడ్డ పుల్లయ్య, మల్లు రామకృష్ణ, వీడికి రత్నం, బాల గంగారావు, కట్ల సంతోష్, మచ్చ వెంకటేశ్వరరావు, మోరంపూడి మధు, కోడిదల కోటేశ్వరరావు, శైలజ, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



# బొమ్మలో కల్చరల్ ఫెస్ట్




**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2 (భద్రాద్రి న్యూస్):**
స్థానిక బొమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో 12వ నేషనల్ లెవెల్ టెక్నికల్ అండ్ కల్చరల్ ఫెస్ట్ ఈ నెల 12వ తేదీన ప్రారంభం కానుంది. బుధవారం కల్చరల్ ఫెస్ట్ కు సంబంధించిన బిపీఎల్ పోస్టర్ ను బొమ్మ చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 సంవత్సరాల నుండి బిపిఎల్ పేస్టును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పేస్ట్ కు మన జిల్లా నుండి కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా విద్యార్థులు వచ్చి పాల్గొంటారు అని తెలిపారు. ఈ ఈవెంట్లో పోస్టర్ ప్రజెంటేషన్, పేపర్ ప్రజెంటేషన్, డాన్సింగ్, సింగింగ్ తదితర ఈవెంట్స్ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సత్య ప్రసాద్, ఫెస్ట్ కన్వీనర్ బి ఎం రంజిత్, సిహెచ్ సాయి, సెక్రటరీ ఉదారు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు ఘన నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ,ఏప్రిల్ 2 (భద్రాద్రి న్యూస్):-**



శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఘన నివాళులు అర్పించారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొని, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి వారి ఆశయ సాధనకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా బీసి అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, గౌడ సంఘం నాయకులు మిత్రు గౌడ్, అంజయ్య, ప్రతినిధులు, ఇతర ప్రజా ప్రతినిధులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎన్. అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యువ వికాసం అమలుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి




**- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**- ఏప్రిల్ 14 వరకు యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ**

**- మండల కార్యాలయాల్లో ఆన్ లైన్ దరఖాస్తుల నమోదుకు సహాయకుల ఏర్పాటు**

**- లాభదాయకమైన యూనిట్లు ఏర్పాటు చేసేలా అవగాహన కల్పించాలి**

**- రాజీవ్ యువ వికాసంపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం ప్రతినిధి ,ఏప్రిల్ 2 (భద్రాద్రి న్యూస్):-**
యువ వికాసం అమలుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, రాజీవ్ యువ వికాసంపై అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులతో కలిసి మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వివిధ కార్పొరేషన్ల క్రింద 50 వేల నుంచి 4 లక్షల రూపాయల వరకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కొరకు రాజీవ్ యువ వికాసం పథకం క్రింద దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు. ఏప్రిల్ 14 వరకు రాజీవ్ యువ వికాసం పథకం క్రింద ఓబిఎంఎంఎస్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఎంపిడిఓ, తహసిల్దార్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ను మంచి కంప్యూటర్, ఇంటర్నెట్ కనెక్షన్ తో ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఆన్ లైన్ దరఖాస్తు చేసుకునేందుకు సహకారం అందించాలని అన్నారు. గ్రామాలలో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన డాక్యుమెంట్ లపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఆధార్, కుల ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రం (గ్రామీణ ప్రాంతాల్లో లక్షన్నర లోపు, పట్టణ ప్రాంతాలలో 2 లక్షల లోపు) మొదలైనవి అవసరమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన కుల ధృవీకరణ పత్రాలు మాత్రమే యాక్సెప్ట్ చేయడం జరుగుతుందని, లబ్దిదారులకు అర్హత ఉంటే తహసిల్దార్ ఫాస్ట్ ట్రాక్ లో అవసరమైన సర్టిఫికెట్ జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. లబ్దిదారులకు అవసరమైన బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలని అన్నారు. మనకు వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి ప్రాక్టికల్ గా నడిచే యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకోవాలని అన్నారు. లబ్దిదారులకు నడిచే యూనిట్లపై ప్రచారం కల్పించాలని అన్నారు. ప్రజావాణి తరువాత సమావేశం నిర్వహించి దరఖాస్తుల స్క్రూటిని, చేపట్టాల్సిన చర్యల పై చర్చించాలని అన్నారు. సెక్టార్ స్పెసిఫిక్ యూనిట్ లను సంబంధిత అధికారులు తప్పనిసరిగా సర్టిఫై చేయాలని కలెక్టర్ తెలిపారు. ఏప్రిల్ 14 తర్వాత రాజీవ్ యువ వికాసం క్రింద వచ్చిన దరఖాస్తులు, ప్రతి మండలంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సరి చూసుకుని స్క్రూటినీ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మండల స్థాయిలో ధృవీకరించిన దరఖాస్తులలో కొంత శాతం జిల్లా స్థాయి అధికారులు మరొకసారి పర్యవేక్షిస్తారని కలెక్టర్ తెలిపారు. జూన్ నెల నాటికి యూనిట్ల గ్రౌండింగ్ కోసం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం సంబంధిత లబ్ధిదారులు లేదా కుటుంబ సభ్యులు మాత్రమే దరఖాస్తు చేయాలని, ఇతరులు దరఖాస్తు చేయడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. పబ్లిక్ తో ఇంటరాక్ట్ అయ్యే సమయంలో ఓపిక ఉన్న అధికారులను పెట్టాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జ్ ఇడి నవీన్ బాబు, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి ఎన్. విజయలక్ష్మీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డా. బి. పురంధర్, ఎల్డిఎం శ్రీనివాస రెడ్డి, బ్యాంక్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల జయంతి వేడుకలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**- ఏప్రిల్ 5న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు**

**- ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహణ**

**- భక్త రామదాసు కళాక్షేత్రం వేదికగా మహనీయుల జయంతి వేడుకలు నిర్వహణ**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2 (భద్రాద్రి న్యూస్):-**
డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల జయంతి వేడుకలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఉదయం 9.00 నుంచి 9-30 గంటల వరకు ఏప్రిల్ 5న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, ఏప్రిల్ 14 న డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరుగుతుందని, అనంతరం ఉదయం 10-30 గంటలకు స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో ఏప్రిల్ 5న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, ఏప్రిల్ 14 న బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహనీయుల జయంతి వేడుకలలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్ని సంఘాల నాయకులు, అన్ని వర్గాల ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




# సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

**- సైబర్ క్రైమ్ డిఎస్పీ ఫణింధర్**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2( భద్రాద్రి న్యూస్):-**
ప్రస్తుత పరిస్థితులలో సైబర్ నేరాలపై మరింత అప్రమత్తంగా వుండాలని సిహెచ్.ఆర్.వి. ఫణీందర్ అన్నారు బుధవారం నగరంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఏస్పీ మాట్లాడుతూ...నకిలీ యాప్ ల ద్వారా డబ్బు, డేటా దోచుకుంటారని అన్నారు. బెట్టింగ్ గేము ముందుగానే ప్రణాళికాబద్ధంగా అమలు చేసి యూజర్ల గెలుపును ప్రోత్సాహిస్తారు, డబ్బు గెలిచినప్పటికీ ఉపసంహరించుకోవడానికి అనుమతించని మోసపూరిత నియమాలను విధించి, డబ్బు విత్ డ్రా చేసుకోలేకుండా చేస్తారని పెర్కొన్నారు. వాట్సాప్ , ఇన్స్టాగ్రామ్, ఇమెయిల్ మరియు ఫేస్ బుక్ నకిలీ ఖాతాలు సృష్టించి, వాటి ద్వారా టిక్కెట్లు ఆఫర్ లో తక్కువకే యిస్తున్నట్లు నమ్మిస్తారు. ముందుగా కొంత డబ్బు తీసుకుని, ఇంకా కొంతమొత్తం కడితేనే టికెట్స్ ఇస్తాము లేకుంటే లేదని, చివరికి బ్లాక్ మేల్ చేస్తారని అన్నారు. నేరస్తులు మీ బాస్, **CEO** లేదా సహెూద్యోగిలా నటించి, అత్యవసరంగా డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడిచేయడం లేదా సున్నితమైన కంపెనీ సమాచారం పొందేందుకు ప్రయత్నించడం. బ్యాంక్/ఆర్థిక సంస్థ మోసం - బ్యాంక్ ప్రతినిధిగా వ్యవహరించి, ఖాతా వివరాలు, **OTP**లు లేదా ఇతర ఆర్థిక సమాచారం దొంగిలించేందుకు ప్రయత్నిస్తారు. ప్రభుత్వ ఏజెన్సీ నకిలీకరణ - ఆదాయ పన్ను శాఖ, పోలీస్ లేదా ఇతర అధికార సంస్థల ప్రతినిధిగా నటించి, జరిమానాలు లేదా ఇతర ఆర్థిక లావాదేవీల పేరుతో మోసం చేస్తారు. ప్రసిద్ధ వ్యక్తులు లేదా సోషల్ మీడియా ప్రభావకులు ప్రమోట్ చేస్తున్నారని గుడ్డిగా నమ్మకుండా వారు చెప్పే ప్రకటనలను పరిశీలించి, బెట్టింగ్ ఆఫ్, మరియు ఆన్లైన్ బెట్టింగ్ విషయాలలోజాగ్రత్త వహించాలని సూచించారు. ఎల్లప్పుడు అధికారికమైన వెబ్సైట్లు లేదా అప్లికేషన్ల ద్వారా మాత్రమే టికెట్లు కొనుగోలు చేయండి. **IPL** టికెట్ పేరుతో వచ్చే లింక్లను క్లిక్ చేయకండి, **APK** లను డౌన్లోడ్ చేయకండి. వ్యక్తి యొక్క అధికారిక నంబరు కాల్ చేయండి. 1930, **NCRP** పోర్టల్ మరియు గోల్డెన్ అవర్ యొక్క ప్రాముఖ్యత. గురించి తెలియజేసారు, ఎవరైన సైబర్ క్రైమ్ భారీ పడితే 1930 కాల్ లేదా **www.cybercrime.gov.in** ద్వారా ఫిర్యాదు చేయండి అని తెలియజేసారు. ఈ కార్యక్రమములో , సైబర్ క్రైమ్ ఎస్. ఐ. రంజిత్ కుమార్ మరియు హెడ్ కానిస్టేబుల్ ఎం ప్రసాద్, ప్రభుత్య వైద్య కళాశాల ఖమ్మం ప్రిన్స్ పాల్ డా: రాజేశ్వరావ్ గారు డా :సరిత గారు , కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశ చరిత్రలో సన్న బియ్యం పంపిణీ పథకం చారిత్రాత్మకంగా నిలిచిపోతుంది

**- డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్.**

**- .రేషన్ షాపులో సన్న బియ్యం ను ప్రారంభించిన డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2( భద్రాద్రి న్యూస్):**

కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన కొమ్మినేపల్లి 1 రేషన్ షాప్ లో బుధవారం నాడు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆరు పథకాలను విజయవంతంగా నిర్వహిస్తూ, మేనిఫెస్టోలో లేని రాజీవ్ యువ వికాస పథకం, సన్న బియ్యం పంపిణీ పథకాలను ప్రారంభించటం జరిగిందని, అంతేకాకుండా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3.86 కోట్ల మందికి సన్న బియ్యం మంజూరు చేయడం దేశ చరిత్రలో చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని అన్నారు. ఈ సన్న బియ్యం పథకము వలన బ్లాక్ మార్కెట్లో సైతం బియ్యం రేటు తగ్గిపోయిందని, ప్రభుత్వం ఇచ్చే ఈ సన్న బియ్యం లో పోషక విలువలు పుష్కలంగా ఉన్నాయని, దీనివలన రక్తహీనత సమస్య, క్యాల్షియం లోపం,తో ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుందని, చిన్నపిల్లలకు కూడా పౌష్టికాహారం లాగా ఉపయోగపడుతుందని, ఉచితంగా ఇచ్చే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బానోతు కస్తూరిబాయి, మాజీ ఉపసర్పంచ్ ధరావతు లాలు, రేషన్ షాప్ డీలర్ల జిల్లా కార్యదర్శి బానోతు నరసింహ నాయక్, పిఎసిఎస్ డైరెక్టర్ మేకపోతుల మహేష్, మత్స్యశాఖ అధ్యక్షులు మేకల మల్లికార్జునరావు, ఎస్ కే రబ్బానీ పాషా శీలం పుల్లయ్య జక్కంపూడి వెంకటేశ్వర్లు, చల్ల మల్లయ్య బండి ఉపేందర్ వల్లం కొండ రాములు, చిర్రా అచ్చయ్య భానోత్ రామచంద్రు, పిట్టల ఉపేందర్, బొమ్మగాని నాగేంద్రబాబు, గుండ్ల వెంకన్న మంద రవి మరియు తదితరులు పాల్గొన్నారు

# ఖమ్మంలో ఘనంగా ప్రారంభమైన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్ర




**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2( భద్రాద్రి న్యూస్):-**

ఖమ్మం నియోజకవర్గంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్ర ఘనంగా ప్రారంభమైంది. ఖమ్మం నగరంలోని 18వ డివిజన్‌లో కార్పొరేటర్ లక్ష్మి మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం నియోజకవర్గ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కోఆర్డినేటర్, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి , జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ హాజరై యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి గారు మాట్లాడుతూ.. యాత్ర ప్రాముఖ్యతను వివరించారు. అంబేద్కర్ పై అమిత్ షా అహంకార పూరిత వ్యాఖ్యలు క్షమించరానివి. అమిత్ షా వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ మరియు యావత్ దేశం తీవ్రంగా ఖండించింది. స్పీకర్ కు, ప్రధాన మంత్రికి చెప్పినా పట్టించుకోలే.. గాంధీ విగ్రహం దగ్గర ధర్నా చేసినా పట్టించుకోలే కాబట్టి నేరుగా ప్రజల ముందుకే తీసుకెళ్ళే ప్రయత్నంగా ఏఐసీసీ ఆదేశాల మేరకు, పీసీసీ సూచనలమేరకు , గౌరవ మంత్రి, ఖమ్మం నియోజక వర్గ ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వర రావు అధ్యక్షతన ఖమ్మం నగరంలో 18 వ డివిజన్ లో యాత్రను ప్రారంభించడం జరిగింది. మనదేశ ఉజ్వల భవిష్యత్తు కోసం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ప్రజలను కోరారు. బీజేపీ రాజ్యాంగ మార్పు కుట్ర ప్రజలకు తెలియజేయాలి. గత ఎన్నికల్లో 400 ఎంపీ సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చే వారు అని అన్నారు. మనకు అహింస, శాంతి సిద్ధాంతాలను అలవరచిన మహాత్ముణ్ణి స్మరించుకుందాం. రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా అందరికి సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత అంబేత్కర్ ఆలోచనలను కాపాడుకుందాం అని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ గారు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని, వారి ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఐడియాలజీ, మహాత్మా గాంధీ సిద్ధాంతాలు కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ప్రయాణానికి మార్గదర్శకాలని, వాటిని సమాజంలో బలంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి, అప్రజాస్వామికంగా పాలన సాగించిందని, ఆ అవాస్తవాలను బహిర్గతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతగానో అవసరమని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టబోయే అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఏఐసీసీ సందేశం, టీపీసీసీ ఆదేశాలను అనుసరించి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రతి మారుమూల గ్రామంలో ప్రచారం నిర్వహించాలని, ప్రతి కార్యకర్త కంకణబద్ధుడై పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా ముక్తార్ జోహార, జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటి అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా **SC** సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, 1 టౌన్ ఇంచార్జి మహ్మద్ ఖాదర్,కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ, పాకాలపాటి విజయ నిర్మల శేషగిరి, మేడా వేంకటేశ్వరరావు,జిల్లా ఆర్టిఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, షేక్ ఖాదర్,బాణాల లక్ష్మణ్, పట్టాభి, షేక్ పాషా, సంపటం నరసింహారావు, కందుల శ్రీనివాస్, ప్రతిభారెడ్డి, చంద్రిక, జ్యోతి, లక్ష్మి, జిల్లా ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ, మదూ రి సైదారావుశివ. కుమార్, షేక్ పాషా, కందుల శ్రీను. తుపాకుల శ్రీను. కృష్ణారెడ్డి. కూరుపాటి ఉదయ్. డివిజన్ ప్రజలు మరియు కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హెచ్ సీయూ విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం ఖండిస్తున్నాం : ఖమ్మం టీడీపీ నేతలు




**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 2 (భద్రాద్రి న్యూస్):-**

తెలుగుదేశం పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో టిడిపి నేతలు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అమ్ముటకు ప్రయత్నించడం దుర్మార్గమని ఇది విద్యావ్యవస్థ మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థం అవుతుందని ప్రభుత్వం యూనివర్సిటీ భూమిని స్వాదీనం చేసుకోవడాన్నీ తెలుగుదేశం పార్టీ తరపున ఖండిస్తున్నామని. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏ విధముగా భూములు అమ్మినదో, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే దారిలో ప్రయత్నిస్తుందని, ఒకపక్క హైదరాబాద్ ప్రజలకు సరైన గాలి వెలుతురు లేక ఇబ్బంది పడుతుంటే, విశాలమైన యూనివర్సిటీ భూమిని విద్యార్డులను భవిష్యత్ తరానికి ఉపయోగ పడే మేదావులుగా మలచడానికి కావలసిన వనరుని ఎందుకు ఈ ప్రభుత్వం కాలరాస్తోందని, అది యూనివర్సిటీ భూమి కాదు, ప్రభుత్వ భూమి అనడం ఏమిటని యూనివర్సిటీలో చదివే పిల్లలు ప్రభుత్వంలో భాగం కాదా అని ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రభుత్వం చేసే దురాగతాన్ని విరమించుకోవాలని, అక్కడ ప్రభుత్వం చేసే దురాగతానికి ఎదురు నిలబడిన విద్యార్థుల మీద ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టడాన్ని తెలుగు దేశం పార్టీ తరపున ఖండిస్తున్నామన్నారు, ఈ యూనివర్సిటీ భూమిని అక్రమించడానికి వెళుతున్న ప్రభుత్వ అధికారుల మీద వన్య ప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసులు పెట్టాలని మేము డిమాండ్ చేస్తున్నామన్నారూ, ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ ఖమ్మం జిల్లా అడహాక్ కమిటి సభ్యులు కేతినేని హరీష్, పాలేరు నియోజక వర్గ ఇన్చార్జి కొండ బాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు, నాగార్జున శ్రీనివాస్, చుండూరు రాజ రాజేశ్వరి, పాలడుగు కృష్ణ ప్రసాద్, కోనేటి సురేష్, తాళ్లూరి నారాయణ, చావా నరేందర్, చల్లగుండ్ల రమేష్, చల్లగుండ్ల, జ్యోతిబసు, మల్లెంపాటి లహరిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఐ ఎన్ టి ఎస్ ఓ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం



**ఖమ్మం ప్రతినిధి ,ఏప్రిల్ 2 (భద్రాద్రి న్యూస్):-**

ఖమ్మం పట్టణంలోని మామిల్లగూడెం శ్రీ చైతన్య పాఠశాల యందు నిర్వహించిన ఫైనల్ లెవెల్ ఐ ఎన్ టి ఎస్ ఓ పరీక్ష ఫలితాలు వెల్లడించడం జరిగింది. ఈ ఫలితాల్లో మామిళ్లగూడెం బ్రాంచ్ కి చెందిన 94 మంది పిల్లలు ఎంపికయ్యారు ఇందులో ఆరవ తరగతి విద్యార్థి తరుణశ్రీ మొదటి బహుమతి మరియు నాల్గవ తరగతి విద్యార్థి శశాంత్ మూడో బహుమతి , తొమ్మిదవ తరగతి విద్యార్థిని కార్తీక సిరి నాల్గవ బహుమతి , ఐదో తరగతి విద్యార్థిని ఆరాధ్య ఐదో బహుమతి మరియు ఎనిమిదో తరగతి అకిరా నందన్ ఐదవ బహుమతి గెలుచుకోవడం జరిగింది . మిగిలిన విద్యార్థులకి 19 స్పెషల్ అండ్ కన్సోలేషన్ బహుమతులు ,16 గోల్డ్ మెడల్ , 59 కన్సోలేషన్,మెరిట్ సర్టిఫికెట్ మరియు గోల్డ్ మెడల్ గెలుచుకోవడం జరిగింది .డైరెక్టర్ శ్రీ విద్య గారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు వారి ప్రతిభను చాటడంలో కృతకృత్యులయ్యారని, ప్రతి పోటీ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థులను సన్నద్ధం చేయడంలో యాజమాన్యం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్ డైరెక్టర్ శ్రీవిద్య,ఏజీఎం చేతన్, హై స్కూల్ కోఆర్డినేటర్ కృష్ణారావు ప్రిన్సిపాల్ నీరజ, డీన్ సైదులు బాబు, ప్రైమరీ కోఆర్డినేటర్ పార్వతి,ప్రైమరీ ఇన్చార్జ్ హారిక, ఐ ఎన్ టి ఎస్ ఓ ఇంచార్జ మానస , విద్యార్థులు పాల్గొన్నారు